క్లుప్తంగా

రేపు కలెక్టరేట్ ముట్టడి

నేలకొండపల్లి: ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేయనున్నట్లు ప్రజాపంథా పాలేరు డివిజన్ కార్యదర్శి పుల్లయ్య తెలిపారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి కూలీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీలకు రోజుకు రూ.600 ఇవ్వాలని, 200 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ముట్టడికి ప్రతీ ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భిక్షం, పి.నాగేశ్వరరావు, రామదాసు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మండలస్థాయి క్రీడా పోటీలు

తిరుమలాయపాలెం: రేపటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే సీఎం కప్–2023 మండలస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే వారు రేపు సాయంత్రం 3 గంటల కల్లా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ తిగుళ్ల శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో పరుగుపందెం, ఫుట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని పిండిప్రోలు కళాశాల ప్రాంగణంలో నిర్వహించే క్రీడలకు 15 నుంచి 36 ఏళ్ల వయస్సు గలవారు అర్హులని, వివరాలకు 99598 85443, 78930 78027 నంబర్లను సంప్రదించాలన్నారు.

మాజీ మంత్రి పరామర్శలు

నేలకొండపల్లి/తిరుమలాయపాలెం: రాష్ట్ర మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నేలకొండపల్లి మండలంలోని రాజారాంపేటలో కుందా నారాయణ, చెరువుమాధారం సొసైటీ చైర్మన్ పగిడిపత్తి శ్రీనివాస్‌ను పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి, శాఖమూరి రమేష్, వెన్నపూసల సీతారాములు, వాకదాని నాగేశ్వరరావు, కడియాల శ్రీనివాసరావు, మేదరమెట్ల రవి, కడియాల నరేష్ పాల్గొన్నారు. అలాగే తిరుమలాయపాలెం మండలంలోని ఏనేకుంటతండా, కాకరవాయి, సుద్దవాగుతండాలో ఇటీవల మృతిచెందిన పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి, జొన్నలగడ్డ రవికుమార్, జల్లెపల్లి ఎంపీటీసీ బాలూనాయక్, చీమ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన విద్యార్థి అప్పగింత

ఖమ్మంరూరల్: మండలంలోని గూడురుపాడుకు చెందిన ఇంటర్ విద్యార్థి మహేష్ ఇంటర్‌లో ఫెయిల్ కావడంతో తల్లి మందలించిందని ఇంటి నుంచి వెళ్లిపోగా పోలీసులు ఆచూకీ కనుక్కొని అప్పగించారు. ఈనెల 9న మహేష్ వెళ్లిపోగా,తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ వెంకటకృష్ణ ఆధ్వర్యాన గాలించగా, శనివారం ఆయన ముదిగొండలో ఉన్నట్లు తెలుసుకుని తల్లికి అప్పగించారు.

పుస్తెలు, మెట్టెలు అందజేత

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడికి చెందిన నిరుపేద పోతురాజు నవ్య వివాహానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఉపసర్పంచ్ గుత్తా వెంకటేశ్వర్లు–చంద్రకళ దంపతులు శనివారం పుస్తెలు, మెట్టెలు అందించారు. నిరుపేద వివాహానికి తమ వంతుగా అందించాలనే లక్ష్యంలో అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కాలింగి వీరబాబు, గాడిచర్ల సత్యనారాయణ,యాకూమీయా, కోలాట బృందం మహిళలు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కస్టడీ
వినోద	విరూపాక్ష
సాయిరాం	రామబాణం
ఆదిత్య	ఉగ్రం
శ్రీనివాస	కేరళ స్టోరీ
సుందర్	కథ వెనుక కథ

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	2
వంకాయ	20		10
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	56		10
కాకర	46	చుక్కకూర	2
సొరకాయ	16		10
బీర	40	తోటకూర	2
దొండ	24		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	40	మెంతికూర	5
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	20		15
చామగడ్డ	36	పుదీన	1
క్యారెట్	50		15
క్యాప్సికం	56	-ఖమ్మం వ్యవసాయం	


కూసుమంచి: జ్యూస్ పాయింట్ వద్ద..


నేలకొండపల్లిలో చెరుకు రసం తాగుతూ..


నేలకొండపల్లి: చలివేంద్రం వద్ద పిల్లలు, పెద్దలు


నేలకొండపల్లిలో కొబ్బరి నీళ్లు కొంటూ..

ఎండల్లో కూల్ కూల్..!

దాహం తీర్చుకునేందుకు ప్రజల వెతలు

- విరివిరిగా వెలుస్తున్న జ్యూస్ పాయింట్లు
- మొబైల్ వాహనాల ద్వారా అందుబాటులో పానీయాలు
- ఊపందుకున్న వ్యాపారాలు

సండే స్పెషల్


కూసుమంచి: పుచ్చకాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

కూసుమంచి/నేలకొండపల్లి: ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడి ప్రతాపం తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. దీంతో మధ్యాహ్న సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. అత్యవస సమయాల్లో మాత్రమే జనం బయటకు వస్తున్నారు. ఉక్కపోత, ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు చల్లటి పానీయాలు జ్యూస్, నిమ్మరసం, కొబ్బరి బొండాలు వంటివి తాగేందుకు జనం ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో ఎక్కడపడితే అక్కడ పుట్టగొడుగులా కొబ్బరిబొండాలు, చెరుకు, నిమ్మరసం, జ్యూస్ పాయింట్లు విరివిరిగా వెలిశాయి. డబ్బులు వెచ్చించి జ్యూస్‌లు తాగలేని వారికి స్వచ్ఛంధ సంస్థలు ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లో తాగునీటిని తాగుతున్నారు.

జోరుగా వ్యాపారాలు..

ఎండలు మండిపోతుండగా ప్రజలు, ప్రయాణికులు ఉపశమనం పొందేందుకు జ్యూస్‌లు తాగుతున్నారు. ఇదివరకు మండల కేంద్రానికే పరిమతమైన ఈ షాపులు ప్రస్తుతం చాలా గ్రామాల్లో విస్తరించాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలతో పాటు వాహనదారులు జ్యూస్‌సెంటర్‌లకు వచ్చి పలు రకాల జ్యూస్‌లు సేవిస్తున్నారు. దీంతో రద్దీ పెరగడంతో పాటు వ్యాపారాలూ ఊపందుకుంటున్నాయి.

ధరలను లెక్కచేయని జనం..

ప్రజలు వేసవి తాపాన్ని తీర్చుకునేందుకు కూడా పడరాని పాట్లు పడుతున్నారు. కొందరు దాహం తీర్చుకునేందుకు మంచినీళ్లు కనబడితే పరుగులు పెడుతుంటే మరికొందరు కొబ్బరి బోండాలు, కూల్‌డ్రింక్స్, జ్యూస్, ఐస్‌క్రీమ్‌లతో దాహాన్ని, తాపాన్ని తీర్చుకుంటున్నారు. చలువ కోసం పుచ్చ, తర్బూజ, ముంజలను తింటున్నారు. పైనాపిల్, ద్రాక్ష, బీట్‌రూట్, కర్బుజా, మ్యాంగో, మిక్సిడ్ తదితర జ్యూస్‌లు ఎక్కువగా తాగుతుండడంతో వ్యాపారస్తులు ధరలు పెంచినా తాపం తీర్చుకునేందుకు ప్రజలు వెనుకాడడం లేదు.

కొబ్బరి నీళ్లు లీటర్ రూ.100..

అత్యవసరంగా ఎండ తీవ్రత నుంచి తట్టుకోవడంతో పాటు శక్తిని అందించే కొబ్బరి బొండాలకు గిరాకీ పెరిగింది. ఏపీలోని పలు ప్రాంతాల నుంచి కొబ్బరి బొండాలను టన్నులు కొద్ది దిగుమతి చేసుకొని ఒక్కో బొండా రూ.30 చొప్పున అమ్ముతున్నారు. లీటర్ వాటర్ బాటిల్ కొబ్బరి నీళ్లు రూ.100 చొప్పున విక్రయిస్తున్నా.. ప్రజలు వాటిని తాగేందుకు క్యూ కడుతున్నారు.

చెరకు రసం, సోడాలు..

ఎండల తీవ్రతతో చెరకురసం, నిమ్మకాయ సోడాల విక్రయాలు కూగా బాగా పెరిగాయి. మొబైల్ వాహనాల్లో ఇట్టి దుకాణాలను పలువురు ఏర్పాటు చేసుకుని రహదారి కూడళ్లలో వ్యాపారాలు సాగిస్తున్నారు. డీహైడ్రేషన్‌ను తగ్గించే గుణం చెరుకు రసంలో ఉండడంతో..తాగేందుకు వచ్చిన ప్రజలకు వ్యాపారస్తులు కొన్ని సబ్జగింజలు కలిపి గ్లాసు రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు.

పుచ్చ కాయలు, తాటి ముంజలు..

ఎండ నుంచి ఉపశమనం పొందే గుణం పుచ్చ కాయలు, తాటి ముంజలకు ఉండడంతో వీటికి కూడా మంచి డిమాండ్ ఉంది. సూర్యాపేట జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పుచ్చలు, ముంజలు తీసుకొచ్చి మండల కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. ఒక్కో పుచ్చకాయ కేజీ రూ.20 నుంచి రూ.30 చొప్పున, తాటి ముంజలు డజను రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు.

ఐస్ క్రీంలు..

వేసవిలో పిల్లలు ఎక్కువగా ఐస్‌క్రీంలు తింటూ ఉపశమనం పొందుతున్నారు. క్రీమ్, కోన్, చాకోబార్, కుల్ఫీ వంటి రకరకాల ఐస్‌క్రీంలు తింటూ వేసవి తాపాన్ని తట్టుకుంటున్నారు. ఇట్టి ఐస్‌క్రీంలను దుకాణాలతో పాటు మొబైల్ వాహనాలలో గ్రామాలకు వచ్చి విక్రయిస్తున్నారు.

పేదోడి ఫ్రిజ్‌లు..

వేసవిలో చల్లటి నీటి కోసం ఆర్థికంగా ఉన్న వాళ్లు ఫ్రిజ్‌లు, నిరుపేదలు కుండలను కొంటున్నారు. ఒక్కో కుండా రూ.200 చొప్పున కొని వేడి నుంచి ఉపశమనం పొందుతున్నారు.

రోజూ చెరుకురసం తాగుతా..


ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు రోజూ చెరుకు రసం తాగుతా. నిత్యం ఎండలో ఆటో నడుపుతుండడంతో డీహైడ్రేషన్ రాకుండా ఉండేలా చూసుకుంటాను. నాతో పాటు నా కుటుంబసభ్యులకు కూడా చెరుకు రసం తీసుకెళ్తా.

– చల్లగుండ్ల బద్రి, ఆటో డ్రైవర్, పైనంపల్లి

వ్యాపారం బాగుంది..


ఎండలు మండిపోతుండడంతో జనం జ్యూస్‌లు తాగేందుకు వస్తున్నారు. వారి కోసం రకరకాల చల్లని జ్యూస్‌లు తయారు చేసి ఇస్తున్నాం. ప్రయాణాలు చేసేవారు, మండలకేంద్రానికి వచ్చేవారు మా వద్దకు వస్తున్నారు. మా వ్యాపారం కూడా బాగుంది.

– బాఛ్‌సింగ్, జ్యూస్‌సెంటర్ నిర్వాహకుడు, కూసుమంచి

జాగ్రత్తలు తీసుకోవాలి..


వేసవిలో సాధ్యమైనంత వరకు ఉదయం 9లోపే పనులు ముగించుకోవాలి. తప్పని పరిస్థితిలో బయటకు వెళ్తే చల్లని పానియాలు కన్నా కొబ్బరి నీళ్లు, పుచ్చకాయలు, తాటి ముంజలు తీసుకుంటే చాలా మంచిది. రంగులు కలిపే పానియాలు తీసుకోవద్దు.

– కె.రాజేష్, వైద్యాధికారి, నేలకొండపల్లి

రైతులకు ఏ ఇబ్బంది రానివ్వొద్దు

కూసుమంచి: పాలేరు నియోజకవర్గంలో తడిసిన ధాన్యం, మొక్కజొన్న పంటలను వెంటనే కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అధికారులను కోరారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సివిల్‌సప్లయ్, వ్యవసాయశాఖ, డీసీఎంఎస్, ఐకేపీ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో కొనుగోళ్ల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాలు వస్తున్నందున కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం, మొక్కజొన్నను వెంటనే కొనుగోలు చేసి గోదాములకు తరలించాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు.ఈ సమీక్షలో ఎంపీపీలు బాణోత్ శ్రీనివాసరావు, బెల్లం ఉమా, బోడ మంగీలాల్, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు,ఆత్మా చైర్మన్ రామసహాయం బాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామాలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం..

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురంతండా, అప్పలనరసింహాపురం గ్రామాల్లో నిర్వహించిన వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అప్పలనరసింహాపురంలో రామాలయం అభివృద్ధికి రూ.లక్ష విరాళంగా అందించారు.

గిరిజన విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచ్, తదితరులు

రఘునాథపాలెం: మండలంలోని కేవీబంజరకు చెందిన గిరిజన విద్యార్థిని అజ్మీరా విజయలక్ష్మి, అదే గ్రామానికి చెందిన అట్లూరి సుజిత 10 జీపీఏ, అజ్మీరా రాజశేఖర్ 9.7 జీపీఏ, వినోద్ 7.7 జీపీఏ సాధించినందుకు విద్యార్థులను శనివారం గ్రామస్తులు అభినందించారు. విద్యార్థులను అభినందించిన వారిలో గ్రామ సర్పంచ్ గుండా మనోహర్‌రెడ్డి, సుడా డైరెక్టర్ అజ్మీరా వీరునాయక్, రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓట్ల కోసమే విగ్రహం ఏర్పాటు


మాట్లాడుతున్న లంకా వెంకటేశ్వర్లు

ఖమ్మం మామిళ్లగూడెం: హైదరాబాద్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం కేవలం దళితుల ఓట్లు దండుకోవడానికేనని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ ఉపాధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధికార ప్రతినిధి పేర్ల మధు అన్నారు. శనివారం ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పిన బీజేపీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడుస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. దళిత బంధు పథకం తెలంగాణలో బీఆర్ఎస్ మోసగాళ్లకు బంధువుగా మారిందన్నారు. దీనిపై అవినీతి జరగకుండా ప్రతీ నియోజకవర్గానికి యూనిట్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పడిశాల వెంకన్న, జిల్లా నాయకులు రవికుమార్, పేర్లశ్యామ్, విజయకుమార్, నాగమణి, రాంబాబు, నరసింహ, నాగేశ్వరరావు, వేణు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ దేవాలయ వార్షికోత్సవం


జల బిందెలతో తరలి వస్తున్న భక్త జనం

రఘునాథపాలెం: మండలంలోని గణేశ్వరం గ్రామంలోని శ్రీశ్రీశ్రీపంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి జలాభిషేకం చేసి సుదర్శన, లక్ష్మీగణపతి హోమాలు నిర్వహించారు. ఆదివారం పూజలు, హోమాల అనంతరం అన్నదానం చేయనున్నట్లు దేవాలయ కమిటీ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలోభక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

నేడు హనుమాన్ జయంతి

ఖమ్మంగాంధీచౌక్: చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలను జరుపుకునేందుకు ఆలయ కమిటీలు సర్వం సిద్ధం చేశారు. ఈసందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు అన్నదానం, హనుమాన్ చాలీసాను భక్తులచే పఠించనున్నారు.

జాబ్‌మేళాను వినియోగించుకోండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శివరామకృష్ణ, తదితరులు

తిరుమలాయపాలెం/నేలకొండపల్లి/కూసుమంచి: నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే భావనతో ఎస్ఆర్ గార్డెన్స్‌లో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో ఈనెల 29న నిర్వహించన్ను జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కిమ్స్ ఆస్పత్రి ఎండీ చావా శివరామకృష్ణ పొంగులేటి అనుచరుడు బజ్జూరి వెంకటరెడ్డి సూచించారు. ఈమేరకు తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, కూసుమంచిలో శనివారం జాబ్‌మేళా పోస్టర్లను వారు విడుదల చేసి మాట్లాడారు. వందకు పైగా కంపెనీల బాధ్యులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తారని వివరాల కోసం 96423 33667, 96423 33668 నంబర్లలో సంప్రదించాలని శివరామకృష్ణ సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, సిరిగద్దె ఉపేందర్, సైపుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. నేలకొండపల్లిలో జరిగిన ఆవిష్కరణలో చిదుముల జాన్‌రెడ్డి, దేవరశెట్టి రాము, పాగర్తి సుధాకర్, మూడు నాగరాజు తదితరులు పాల్గొనగా.. కూసుమంచిలో పొంగులేటి అభిమానులు వీరారెడ్డి, సత్యనారాయణ, సురేష్, మధు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీడీసీఎల్‌లో ఖాళీలను భర్తీ చేయాలి

ఖమ్మంవ్యవసాయం: ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ సంస్థలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ అనుబంధం)రాష్ట్ర అధ్యక్షుడు కే.ఈశ్వర్‌రావు డిమాండ్ చేశారు. శనివారం వరంగల్ టీఎస్‌యూఈఈయూ కార్యాలయంలో ఎన్‌పీడీసీఎల్ కంపెనీ కమిటీ అధ్యక్షుడు జి.ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఈ నెల 25వ తేదీన ఎన్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులను కలవనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్‌పీడీసీఎల్ కంపెనీ కమిటీ కార్యదర్శి ఎం.ప్రసాద్, గౌరవ అధ్యక్షులు జి.ప్రభాకర్‌రెడ్డి, నలవాల స్వామి, కొలగాని రమేష్, వెంకటేష్, శ్రీనివాస్, శివ, శ్రీకాంత్, రాఘవేంద్రరావు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలి


ధాన్యాన్ని పరిశీలిస్తున్న పొంగులేటి

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరంలోని రామన్నపేటలో తడిసిన వరి ధాన్యాన్ని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్లాల్లో ఉన్న వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా నగరంలోని 10వ డివిజన్ చైతన్యనగర్‌లోని బైపాస్‌రోడ్డులో శ్రీభక్తాంజనేయ విగ్రహం ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన హోమం పూజల్లో పొంగులేటి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ ప్రారంభం తర్వాత అన్నదానం కార్యక్రమం ఉంటుందని కార్పొరేటర్ చావా మాధురి నారాయణరావు తెలిపారు.

'ది కేరళ స్టోరీ'ను నిషేధించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ది కేరళ స్టోరీ సినిమాను తెలంగాణలో నిషేధించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక వన్‌టౌన్ కార్యాలయంలో అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సినిమాలో మతోన్మాద శక్తులకు అనుగుణంగా 32 వేల కేరళ అమ్మాయిలను తీవ్రవాద సంస్థలకు అప్పజెప్పినట్లు తప్పుడు ప్రచారం చేశారన్నారు. అలాగే మహిళా రేజ్లర్లపై లైంగిక వేదింపులకు గురిచేసిన బీజేపీ ఎంపీ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16న జరిగే జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సహాయకార్యదర్శి కూరపాటి శ్రీను, నాయకులు వెంకటరమణ, మహేష్, రెహమాన్ ఖాన్, నవీన్, సాయి, గోపి తదితరులు పాల్గొన్నారు.

కరాటే కల్యాణి వ్యాఖ్యలు సరికాదు

ఖమ్మంమయూరిసెంటర్: కృష్ణావతారంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుపై సినీనటి కరాటే కల్యాణి చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని ఖమ్మం ఎన్టీఆర్ అభిమాన సంఘం సభ్యుడు లలిత్ చౌదరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీలు, వర్గాలకు అతీతంగా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తుంటే రాద్ధాంతం ఎందుకన్నారు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే ఇలా చేస్తున్నారని పేర్కొన్నారు.

జింక జాడ కోసం అధికారుల వేట


జింక కోసం గాలిస్తున్న అధికారులు

ఖమ్మంఅర్బన్: జిల్లా కేంద్రంలో జింక సంచరించినట్లుగా స్థానికుల నుండి అందిన సమాచారంతో అటవీశాఖ అధికారులు శనివారం గాలింపు చేపట్టారు. ఖమ్మం మమత రోడ్డులోని ఫైవ్ ఎలిమెంట్స్ సముదాయం పరిసరాల్లో శనివారం జింక తిరిగినట్లు స్థానికులు అటవీశాఖ రేంజ్ అధికారి రాధికకు సమాచారం ఇచ్చారు. దీంతో వెలుగుమట్ల పార్కు సెక్షన్ అధికారి వేణుమాధవ్, బీట్ అధికారులు రవి, జ్యోతి, సిబ్బంది పరిసరాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. ఎవరికైనా జింక కనపడితే తమకు తెలియజేయాలని వారు కోరారు.

అక్రమ వెంచర్లపై ఫిర్యాదు

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో అనుమతి లేకుండా వెంచర్లు ఏర్పాటుచేస్తుండడంతో కాక మట్టి సరఫరా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ కోరారు. ఈమేరకు శనివారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెంచర్లు, మట్టి తరలింపుపై అధికారులకు తెలిపినా పట్టించుకోవటం లేదని పేర్కొన్నారు.

కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం పలు మండలాల్లో సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీలు నిర్వహించి సందడి చేశారు. కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చారు. అనంతరం స్వీట్లు పంచి పెట్టారు. దేశంలో బీజేపీ పతనం మొదలైందని, తెలంగాణలో కర్ణాటక ఫలితాలే పునరావృతమవుతాయని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పేర్కొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


బాణాసంచా కాల్చుతున్న డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నాయకులు


ఇందిరాగాంధీ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న ఎం.డీ.ముస్తఫా, తదితరులు


తిరుమలాయపాలెం: విజయోత్సవ సంబరాల్లో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు


కూసుమంచి: బాణాసంచా కాల్చుతున్న కాంగ్రెస్ నాయకులు


నేలకొండపల్లి: విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న రాయల నాగేశ్వరరావు


కామేపల్లి మండలం లింగాలలో నాయకుల సంబరాలు